శనివారం । తెలంగాణ
02 మే 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం




# ఎవరెస్ట్ శిఖరాగ్రాన.. ఎదిగిన 'మమకారం'

## మోతీ కుమార్ కృతజ్ఞత.. వెంకటపుల్లయ్య సేవా నిరతి!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే03 (నినాదం)**

సాధారణంగా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన వారు తమ దేశ జెండానో, లేక తమ విజయానికి గుర్తుగా ఏదైనా చిహ్నాన్నో అక్కడ ఉంచుతారు. కానీ, ఒక పర్వతారోహకుడు మాత్రం తాను ప్రపంచం గర్వించే స్థాయికి చేరడానికి నిచ్చెనగా నిలిచిన ఒక 'మమకారం' ఉన్న మనిషి ఫోటోను అక్కడ ఎగురవేశాడు. ఆ దృశ్యం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా, మానవ సంబంధాల గొప్పతనాన్ని చాటిచెబుతోంది.

**గురువుకు శిష్యుడి 'శిఖర సమాన' గౌరవం..**

నిరుపేద కుటుంబంలో పుట్టి, కనీసం సరైన వసతులు లేని స్థితిలో ఉన్న మోతీ కుమార్ అనే పర్వతారోహకుడి ప్రతిభను గుర్తించి, అతని ఎదుగుదలకు తోడ్పాటునందించారు భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ), తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సంఘం వెంకటపుల్లయ్య. మోతీ కుమార్ పర్వతారోహణలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను తనవిగా భావించి, అతనికి వెన్నుదన్నుగా నిలిచిన వెంకటపుల్లయ్య – విజయలక్ష్మి దంపతుల ఫోటోను మోతీ కుమార్ ఎవరెస్ట్ శిఖరంపై ప్రదర్శించి తన కృతజ్ఞతను చాటుకున్నాడు. ఇది కేవలం ఒక ఫోటో ప్రదర్శన మాత్రమే కాదు, సహాయం పొందిన వ్యక్తికి ఉన్న సంస్కారానికి, సహాయం చేసిన అధికారికి ఉన్న మానవత్వానికి నిదర్శనం.

**అధికారిగా బాధ్యత.. మనిషిగా సేవా తత్పరత**

"మనిషి ఎదిగే కొద్దీ ఒదగాలి" అంటారు. వెంకటపుల్లయ్య తన సేవాగుణంతో ఒదిగి ఉంటే, ఆయన సాయం పొందిన మోతీ కుమార్ ఆ సేవా మూర్తిని శిఖరాగ్రాన నిలబెట్టారు. పదవి ఉన్నప్పుడు పది మందికి సాయం చేసే గుణం ఉన్న వెంకటపుల్లయ్య వంటి వ్యక్తులు ఉన్నప్పుడే సమాజం బాగుంటుందని ఈ సంఘటన మరొక్కసారి నిరూపించింది. వెంకటపుల్లయ్య కేవలం ఒక ప్రభుత్వ అధికారిగానే కాకుండా, సమాజంలో ఒక మార్పు కోరుకునే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. మొక్కల పెంపకంపై ప్రత్యేక మక్కువతో, పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తుంటారు. లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు. మోతీ కుమార్ వంటి ఎందరో యువకుల ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు తన వంతు సహకారం అందిస్తున్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రముఖులు**

ఒక అధికారి తన పదవిని కేవలం అధికారానికే కాకుండా, తోటి మనుషుల ఉన్నతి కోసం ఉపయోగిస్తున్న తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచంలోనే ఎత్తైన శిఖరంపై ఒక సాధారణ ప్రభుత్వ అధికారి ఫోటో మెరవడం జిల్లా వాసులకు గర్వకారణంగా మారింది. మోతీ కుమార్ చూపిన ఈ గురుదక్షిణకు జిల్లాలోని పలువురు ప్రముఖులు, గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.